తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త




## "దివ్యరథం"పై సీతాలక్ష్మణ కోదండరాముడు

### భక్తులే గుర్రాలుగా రథంలాగి పునీతులు



తిరుపతి,మార్చి 27ప్రభాతవార్త:

"రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మవిద్యతే" ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తూ శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణసమేతుడై రథంపై అధిరోహించి భక్తులను కటాక్షించాడు. తిరుపతిలో కోదండరామస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరగా సోమవారం ఉదయం అత్యంత వేడుకగా రథోత్సవం జరిగింది. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు, అధికారులు కర్పూర హారతులిచ్చి రథం లాగారు. భక్తులే అశ్వాలుగా రామనామ నామస్మరణల మధ్య అత్యంత భక్తివిశ్వాసాలతో లాగిన ఈ రథోత్సవం మాఢవీధుల్లో కన్నులపండువగా సాగింది. రథోత్సవం అన్నివిధాలా శ్రేష్టమైంది. ఆత్మరథికుడు, శరీరమే రథం. బుద్ధి సారధి, మనస్సు పగ్గం.ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంలో పోల్చడంతో స్థూలశరీరం వేరని, సూక్ష్మశరీరం వేరని,ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది.ఈ రథోత్సవంలో పెద్దజీయర్‌స్వామి,చిన్న జీయర్ స్వామి, టిటిడి సిఇ నాగేశ్వరరావు, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఇఇలు వేణుగోపాల్, శివరామకృష్ణ, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి, ఎలక్ట్రికల్ డిఇ చంద్రశేఖర్, ఎఇఒ మోహన్, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి భక్తులు పాల్గొన్నారు.

**-రాత్రి అశ్వవాహనంపై శ్రీరామచంద్రమూర్తి:**

కోదండరాముని వార్షికబ్రహ్మోత్సవాల్లో చివరివాహనం సోమవారంరాత్రి అశ్వవాహనంపై శ్రీరామచంద్రమూర్తి భక్తులను కటాక్షించాడు. కలియుగాంతంలో స్వామి కల్కిమూర్తియై గుర్రంపై పయనిస్తూ ,ఖడ్గధారియై దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తాడని పురాణాలు పేర్కొన్నాయి. ఈ అశ్వవాహనత్వం, కల్కి అవతారాన్ని గుర్తుచేస్తుంది.

## గంగమ్మఆలయం అంతరాలయంలో గజలక్ష్మిప్రతిమ ప్రతిష్టాపన



తిరుపతి,మార్చి 27ప్రభాతవార్త:

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న గర్భాలయం పునర్నిర్మాణ పనుల్లో సోమవారం ఉదయం అంతరాయం ముందర సింహపుద్వారంపై గజలక్ష్మిఅమ్మవారి ప్రతిమ ప్రతిష్టాపన చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఆలయ ఇఒ ఎం.మునికృష్ణయ్య, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అమ్మవారి సింహద్వారం ప్రతిష్టాపనకు కర్పూర హారతులిచ్చారు. అనంతరం ఆలయంలో అమ్మవారి హుండీ లెక్కింపుల్లో 23,35,036రూపాయలు ఆదాయం లభించింది. 20,250 గ్రాముల బంగారం, 269గ్రాముల వెండి వచ్చింది.

## ఆరోగ్య సమాజం ఆవిష్కరణకు సిఎం కంకణం

### 104 సంచార వైద్య వాహనాలను ప్రారంభించిన జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు, మార్చి 27 ప్రభాతవార్త:

ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కంకణం కట్టుకొని ప్రజారోగ్యం కోసం పలు వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన 13(104 సంచార వైద్య) వాహనాలను సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముదలతో కలిసి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి 2022 అక్టోబర్‌లో మొదటి విడతగా 31 వాహనాలను ప్రారంభించారని, ప్రస్తుతం 2వ విడతగా 13 వాహనాలను జిల్లాకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ వాహనాలు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తాయన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి ఇంటికి వైద్యులు వెళ్ళి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. జెసి డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యంకు అత్యతం ప్రధాన్యత ఇచ్చి పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ప్రకాశం, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్, డిఐఒ డాక్టర్ రవిరాజు, డిపిఎంఒ డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, 104 నోడల్ అధికారి సందీప్, జిల్లా మేనేజర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



104 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప, ఎమ్మెల్యే శ్రీనివాసులు.

## ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



### -నూతన 104 వాహనాలు ప్రారంభంలో ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, మార్చి27 ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు మెరుగైన ఆధునిక వైద్య సేవలు అందించాలనే మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లాలో 104 వాహనాలు 32 ఉండగా మరో 7 కొత్త వాహనాలను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్యే భూమన, మేయర్ డాక్టర్ శిరీషలు జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోనే వైద్యం అందుబాటులో ఉండేలా ప్రతి 2వేల మందికి వైయస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రజల గడప వద్దకే వైద్యం అందిచేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా జిల్లాలోని 436 విలేజ్ క్లినిక్‌ల పరిధిలోని సచివాలయాలను కవర్ అయ్యేలా, ప్రతి సచివాలయ పరిధిలో నెలకు రెండుసార్లు వైద్య సేవలు అందిస్తున్నాయని తెలిపారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ శ్రీహరి, 104 జిల్లా కో-ఆర్డినేటర్ శేషశయనారెడ్డి, డాక్టర్ చత్ర ప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీతో ధనార్జనే ధ్యేయంగా
## రూ.కోట్ల కుంభకోణం

### జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు కుప్పం సామాజిక వేత్తలు ఫిర్యాదు

చిత్తూరు, మార్చి 27 ప్రభాతవార్త

కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద ధనర్జానే ధ్యేయంగా కోట్ల రూపాయల కుంభకోణానికి అక్కడి వైద్యులు తెరలేపారని ఈ విషయంపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కుప్పం సామాజిక వేత్తలు సోమవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను కుప్పం సామాజిక వేత్తలు సోమవారం గ్రీవెన్స్ డేలో కలిసి కుప్పం ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేశారు. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డెలవరీ అయిన నవజాత శిశువులు ఆరోగ్యవంతంగా జన్మించినప్పటికీ పిల్లలకు పచ్చకామర్లు సోకినట్లు, సెప్టిక్ చేసినట్లు తల్లిదండ్రులను వైద్యులు భయభ్రాంతులకు గురి చేసి ప్రైవేటు ఆసుపత్రుల నుండి తప్పుడు నివేదికలు తెప్పించుకొని అన్యాయం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో అన్ని పరీక్షలు అందుబాటులో వున్నప్పటికీ ఇక్కడ విధులు నిర్వహించే వైద్యులు తమ ప్రైవేటు ఆసుపత్రులు లబ్ది పొందడం కోసం అన్ని పరీక్షలను ప్రైవేటు ఆసుపత్రులకే వెళ్ళి తీసుకురావాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్రంగా విచారించి నిరుపేద రోగులకు న్యాయం చేయాలని వారు జెసిని అభ్యర్థించారు. ఈ విషయంపై స్పందించిన జెసి డాక్టర్ వెంకటేశ్వర్ సత్వరం ఈ వ్యవహారంపై విచారించి నివేదిక ఇవ్వాలని డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్‌ను ఆదేశించారు.

## ఘోర రోడ్డుప్రమాదం

### - ఇద్దరు యువకులు మృతి



రోడ్డు ప్రమాద దృశ్యం, ఇన్‌సెట్‌లో శరీరం నుంచి వేరైన తల

రేణిగుంట, మార్చి 27 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం మామండూరు పంచాయతీ కుక్కల దొడ్డి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ఒకరి తల మొండెం నుంచి విడిపోయి దూరంగా పడింది. పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన షేక్ ఇబ్రహీం(21), షేక్ మహ్మద్ మూసాబర్(30) ద్విచక్రవాహనాన్ని అమ్మడానికి ద్విచక్రవాహనంపై చెన్నైకి వెళ్లారు. చెన్నై నుంచి తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న వాహనం మామండూరు దాటి కుక్కల దొడ్డి సమీపిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న షేక్ ఇబ్రహీం హెల్మెట్ ధరించి ఉండడంతో హెల్మెట్ మెడ తల జాయింట్ మధ్య గట్టిగా ఒత్తడంతో తల మొండెం నుంచి వేరై దూరంగా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు అర్బన్ సీఐ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు... హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. సీఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్పందనకు 349 అర్జీలు

చిత్తూరు, మార్చి 27 ప్రభాతవార్త:



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం 349 సమస్యలు వచ్చాయి. స్పందన కార్యక్రమానికి హాజరైన జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 225 అర్జీలు, హౌసింగ్ 13, రేషన్‌కార్డులు 85, డ్వామా 2, పశుసంవర్ధక, హార్టికల్చర్, మున్సిపల్, ఎల్డీఎం, వ్యవసాయశాఖ, ఎస్ఎస్ఎ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలకు సంబంధించి ఒకొక్క అర్జీ అధికారులకు అందాయి. ఈ అర్జీలను సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.

## ఏప్రిల్ 15నుంచి భక్తుల సేవలో 10 "విద్యుత్ ధర్మరథాలు"

తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:

డీజిల్‌తో నడిచే ఉచిత ధర్మరథాలు స్థానంలో టిటిడి విద్యుత్‌తో నడిచే "ధర్మరథాలు"ఉచిత విద్యుత్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. మేఘా సంస్థ విరాళంగా ఇచ్చిన ఈ విద్యుత్ బస్సులను సోమవారం మధ్యాహ్నం ఈ ధర్మరథాలను రాంభగీచా అతిధిగృహాల వద్ద టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం, ఒలెక్ట్రా సంస్థ సిఎండి కెవి ప్రదీప్, రవాణా జిఎం శేషారెడ్డి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ విద్యుత్ ధర్మరథాలు ఏప్రిల్ 15వతేదీ నుంచి భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ బస్సులకు రిజిస్ట్రేషన్, తిరుమల ఘాట్‌లో ప్రయాణించడం వంటి తనిఖీల ప్రక్రియ జరగనుంది.



## ఆధ్యాత్మిక వాదులందరు భాగస్వాములు కావాలి

### ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి,మార్చి 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రసన్నవరద రాజస్వామి ఆలయం పురాతనమైనదని, దానిని మరమ్మత్తులకు నిర్ణయించగా ఆలయ పరిస్థితిని పరిశీలించిన స్థపతి పురాతనమైన రాయి దెబ్బ తిన్నదని గోడలు తొలగించాలని సూచించినట్లు ఇఓ వి కె సాగర్‌బాబు, ధర్మకర్తల మండలిఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సోమవారం వివరించారు.ఆలయ పరిపాలనా భవనం సమావేశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి సంబందించి ఏక పక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈ నెల 17న మూల విరాట్టును తొలగిస్తున్నట్లు సుమారు వారం రోజుల పాటు పట్టణంలో బహిరంగంగా ప్రచారం నిర్వహించామని ఆధ్యాత్మిక వాదులందరిని ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చామన్నారు. అంతేకాక మీడియ ధర్మకర్తల మండలి అధ్యక్షులు,సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, పోలీసులు,రెవెన్యూ,దేవస్థానం ఇంజనీరింగ్ అధికారుల సమక్షంలో పంచనామా జరిపించామన్నారు. అందరి సమక్షంలోనే మూలవిరాట్టు కింద సుమారు పది అడుగుల లోతు తవ్వామన్నారు. ఇందులో 37 బంగారు రేకులు, రెండు బంగారు కాసులు, నవరత్నాలు నాలుగు రాగిరేకులు లభ్యమయ్యాయని వీటిని దేవస్థానం



స్ట్రాంగ్ రూంలో భద్రపరచినట్లు వివరించారు. పంచనామా కార్యక్రమాలను సిసి కెమెరాల పర్యవేక్షణలో నిర్వ హించబడిందని వివరించారు. ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్ని ర్మాణం పనులు దేవాదాయశాఖ నియమనిబంధనలకు లోబడి చేయటం జరుగుతుందన్నారు. ఆలయ అభివృద్ధి పనులు రాజకీయాలకు అతీతంగా దేవాదాయశాఖ నియమ నిబంధనలకు లోబడి మాత్రమే చేస్తామని స్పష్టం చేసారు. ఆసత్య ఆరోపణలు చేసిన వారిపై దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తున్నామని వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈసమావేశంలో ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, వరదరాజస్వామి ఆలయ పూజారి శ్రీనివాసశర్మ, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ లోకేష్‌రెడ్డి,సతీష్‌మాలిక్,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## మహిళాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

### డిప్యూటీ సీఎం నారాయణస్వామి
### - మండల మహిళ సంఘాలకు చెక్కు పంపిణీ



మహిళలకు చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి.

గంగాధర నెల్లూరు, మార్చి 27 ప్రభాతవార్త :

మహిళాభివృద్ధి, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్రం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ఆవరణంలో మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా పంపిణీ కార్యక్రమ సమావేశం ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. ఆసరా పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట భజన బృదంతో నారాయణస్వామి కోలాట భజన చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముందుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్ర పటంకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామిని క్యాలండర్‌గా చేసుకుని పారదర్శకంగా సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతలోకి జమచేస్తున్న ఘనత కేవలం మన ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యమయిందన్నారు. రాష్ట్రం ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నా హామి ఇచ్చిన ప్రతి మాట నేరవేర్చడం జరుగుతుందని గుర్తు చేశారు. రైతులకు రుణాలు, మహిళ సాధికారత సాధించడంకు వైఎస్ఆర్ ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా మహిళ సంఘాల బలోపేతంకు నగదు చెల్లింపు చేయడం జరుగుతుందన్నారు.మండలంకు 1283 సంఘాలకు12053 మంది లబ్ధిదారులకు 15.48 కోట్ల రూపాయలు మూడవ విడత పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆ మేరకు నగదు చెక్కును మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, జడ్పిటీసీ సభ్యురాలు లక్ష్మిప్రియ, మండల పార్టీ అధ్యక్షులు పూర్ణచంద్రా రెడ్డి, నాయకులు సురేందర్ రెడ్డి, చిన్నమ రెడ్డి, కమలాకర్ రెడ్డి, హరిబాబు, ఎంపిడివో శ్రీదేవి, ఏపియం చిరంజీవి,మహిళలు, సంఘమిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో ఇంటి స్థలాల మంజూరుకు భూసేకరణ

– జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు, మార్చి 27 ప్రభాతవార్త:



కుప్పం నియోజకవర్గ పరిధిలో అర్హులైన వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయడానికి అవస రమైన భూమిని భూసేకరణ ద్వారా త్వరలో సేకరించి ఇంటి స్థలాలు పంపిణీ చేయ దానికి చర్యలు తీసుకొంటా మని జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం ఎమ్మెల్సీ భరత్, రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్‌లు ఇంటి స్థలాల మంజూరుపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జెసి వారితో మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ పరిధిలో 90 రోజుల్లో ఇళ్ళ స్థలాలు మంజూరు చేయడం కార్యక్రమంలో పలువురు దరఖాస్తులు చేసుకొన్నారన్నారు. ఇందులో అర్హులైన వారిని గుర్తించి వారికి స్థలం పరిశీలించి ఎంపిక చేసి పంపిణీకి చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.

## చిత్తూరు జిల్లా మంత్రులకు ఓటమి తప్పదు

–టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి

వెదురుకుప్పం, మార్చి 27 ప్రభాతవార్త :



రాష్ట్రంలో నలుగురు ఎమ్మెల్సీ లు గెలవడంతో తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ది లక్కీ లెగ్ అని తెలిపోయిందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి చెప్పారు. పాత్రికేయులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 27న కుప్పంలో ప్రారంభ మైన ఆయన పాదయాత్ర ఉమ్మడి చిత్తూరు జిల్లా దాటకముందే మూడు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థులు గెలిచారని చెప్పారు. అనంతపురం జిల్లాలో పాదయాత్ర ప్రారంభం కాగానే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి గెలిచారని తెలిపారు. ఇది అంత లోకేష్ పాదయాత్ర మహిమే అన్నది వైకాపా నేతలు గుర్తించాలని చెప్పారు. లోకేష్ పాదయాత్ర ప్రారంభించిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న 14 ఎమ్మెల్యే స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. జిల్లాలో విర్రవిగుతున్న మంత్రులు రామచంద్రా రెడ్డి, రోజా, నారాయణస్వామి ఓటమిపాలవడం ఖాయమని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రారంభమైన చంద్రబాబు పవనాలు ఎన్నికల నాటికి సునామీలుగా మారుతాయని చెప్పారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలి

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ – విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామ గ్రి వితరణ

కుప్పం, మార్చి 27 ప్రభాతవార్త



విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ సూచించారు. సోమవారం స్థానిక బాలుర, బాలికల హైస్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఛైర్మన్ పరీక్ష సామగ్రిని తనవంతు సాయంగా అందించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు కష్టపడి చదివించే తీరును మరచిపోరాదన్నారు. పదో తరగతి విద్యార్థి దశలో ఎంతో కీలకమన్నారు. పరీక్షలంటే భయం విడనాడాలన్నారు. పట్టుదలతో చదివితే అసాధ్యం కూడా సుసాధ్యమవుతుందన్నారు. పదవ తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించే విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో కమీషనర్ రవిరెడ్డి, కౌన్సిలర్లు రంగయ్య, గణపతి, అరవింద్, ఆంజనేయస్వామి గుడి ఛైర్మన్ కుమరేష్, మైనార్టీ అధ్యక్షుడు సర్దార్ బాషా, అధికార ప్రతినిధి ఇంతియాజ్, రాజా, రాము, హెచ్ఎంలు ఈశ్వరాచారి, వెంకటేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవ తరగతి కేంద్రాల వసతులపై ఆరా తీస్తున్న డిప్యూటీ డిఈవో

కోట, మార్చి 27, ప్రభాతవార్త

ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను, వసతులపై డిప్యూటీ డిఈవో శివప్రసాద్ రెడ్డి ఆరా తీసారు. సోమవారం కోటలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల కేంద్రాలతో పాటు విద్యానగర్‌లోని బాల భారతి, చిట్టేడులోని ఎస్సి గురుకుల పాఠశాలలో వసతులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ వెంకటసునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

## నర్సింగ్ విద్యార్థినులు రోగుల సేవే లక్ష్యంగా పనిచేయాలి

– రాష్ట్ర ఎంఎల్‌హెచ్‌పి కోఆర్డినేటర్ డా॥ హేమలత

కుప్పం, మార్చి 27 ప్రభాతవార్త



నర్సింగ్ విద్యార్థినులు రోగుల సేవే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ఎంఎల్‌హెచ్‌పి కోఆర్డినేటర్ డా॥ హేమలత పేర్కొన్నారు. కుప్పం నర్సింగ్ కళాశాలలో సోమవారం కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినులకు మెమోయిర్ ఫియస్టా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థినులు ఫ్లారెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నర్సింగ్ వృత్తి తల్లి లాంటిదన్నారు. అనారోగ్యంపాలై రోగులు ఆస్పత్రిలో చేరినపుడు అమ్మకన్నా మిన్నగా చూసే నర్సులను దేవుడు సృష్టించాడన్నారు. అమ్మకు ప్రతిరూపం నర్సులు అని వృత్తిధర్మానికి కట్టుబడి యుద్ధంలో సైనికుల్లా పనిచేయాలన్నారు. రోగుల్లో మానసిక ధైర్యం పెంపొందించాలని సూచించారు. అనంతరం డా॥ హేమలతను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ విమల జోసెఫ్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో రీ సర్వే హద్దుల రాళ్లు ఏర్పాటు

కుప్పంరూరల్, మార్చి 27ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ంగా చేపట్టిన సమగ్ర భూసర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దు రాళ్లను నాటుతున్నారు. తహశీల్దార్ పార్వతి ఆదేశాల మేరకు మండలంలోని గుట్టపల్లి గ్రామంలో సోమవారం రీసర్వే రాళ్ల నాటారు. ఈ గ్రామంలో 952 రాళ్లు నాటాల్సి ఉండగా సోమవారం నాటికి 175 రాళ్లు నాటారు. కార్యక్రమంలో రీసర్వే డిటి రెడ్డెప్పరెడ్డి, విఆర్వో కృష్ణమూర్తి, సర్వేయర్లు వరలక్ష్మి, అహ్మద్ పాషా, శ్రీనివాసులు, మోనిక, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ధర్నా

శాంతిపురం, మార్చి 27 ప్రభాతవార్త



మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ కోతిగుట్లపల్లికి చెందిన గ్రామస్తులు పలువురు స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలో ధర్నా చేపట్టారు. రెడ్లపల్లి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో తమకు స్మశాన వాటిక భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. అక్కడ కొంతమంది గ్రామస్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించు కున్నారని పేర్కొన్నారు. రాళ్లబూదుగూరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు.

## టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి

– డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ

చిత్తూరు, మార్చి 27 ప్రభాతవార్త:



ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలకు ఉపాధి ఇచ్చే కార్యక్రమం టైలరింగ్ ఒక్కటేనని డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ పేర్కొన్నారు. డిఆర్‌డిఎ, జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు 45 రోజుల పాటు టైలరింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకొన్న మహిళా సభ్యులకు డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ సోమవారం సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పిడి డిఎంకె తులసీ మాట్లాడుతూ డిఆర్‌డిఎ, జిల్లా యువజన శాఖ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సభ్యులు దీనిని సద్వినియోగం చేసుకొని టైలరింగ్‌లో మహిళలు రాణించాలన్నారు. టైలరింగ్‌లో మెళకువలు నేర్చుకొంటే మహిళలు సులభంగా ఉపాధి పొందవచ్చునన్నారు. టైలరింగ్ రంగానికి ప్రస్తుతం డిమాండ్ వుందన్నారు. టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకొన్న మహిళలకు రుణాల ద్వారా కుట్టు మిషన్లు కొనుగోలు చేసే అవకాశం వుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వెంకటేష్, ఎపిఎం ఖాదర్‌వల్లీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బంగారుపాళ్యం, మార్చి 27 ప్రభాతవార్త:



చిత్తూరు నగరం మెసానికల్ గ్రౌండ్స్ డిఎస్ఎ కార్యాలయంలో సోమవారం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు అయ్యింది. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్.సిరాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా బి.సుదర్శన్‌నాయుడు, ప్రధాన పోషకుడిగా ఎన్.తులసీరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా జి.కృష్ణారెడ్డి, కోశాధికారి పి.మురారిలు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా కె.చంద్రశేఖర్‌రాజు, ఎన్‌బి జయప్రకాష్, కె.సుకుమార్‌బాబు, వి.రోహిత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా పి.శ్రీహరిరెడ్డి, బి.కుమార్, ఎన్.గణేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు పరిశీలకులుగా ఎపి వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధిగా కడప జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోలా శ్రీనివాసులురెడ్డి, శాప్ ప్రతినిధిగా ఉదయభాస్కర్, ఒలంపిక్ సంఘ ప్రతినిధిగా కె.కృష్ణలు హాజరయ్యారు. బంగారుపాళ్యం మండలానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులు సుదర్శన్‌నాయుడు, ఎంబి జయప్రకాష్, మురారి, తులసీరెడ్డి, కుమార్‌లు ఎంపిక కావడంతో పలువురు వాలీబాల్ క్రీడాకారులు హర్షం తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నిర్ణీత ధరలకే మద్యం అమ్మాలి

రొంపిచెర్ల,మార్చి 27 ప్రభాతవార్త:



ప్రభుత్వమద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది మద్యాన్ని నిర్ణీత ధరలకే అమ్మాలని లేకుంటే చర్యలు తప్పవని చిత్తూరు ప్రొహి బిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్ సిబ్బందిని హెచ్చరించారు. పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిదిలోని రొంపిచెర్ల మండలంలో గల వివిధ ప్రభుత్వమద్యం దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే మద్యం అమ్మాలన్నారు. మద్యం అమ్మకాలకు సంబందించిన ధరల్లో తేడాలు తెలుసుకునేందుకు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. నిల్వగల స్టాకును సిబ్బంది సహాయంతో తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో అధికారులతో పాటు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కల్లూరు, మార్చి 27 ప్రభాతవార్త:



పిల్లలు, గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బాలికలు పోషకాహారం తీసుకోవడం వల్లనే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని ఎంపీపీ సురేంద్రరెడ్డి అన్నారు. సోమవారం పులిచెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార పక్వాడ కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వీలైనంత మేరకు ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ ఫ్రూట్స్ వంటివి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న గుడ్లు వైఎస్సార్ కిట్, భోజనంతీసుకోవడం వల్ల అనీమియా,లోప పోసణకు దూరంగ ఉండి ఆరోగ్యవంతులుగా ఉంటారిన్నారు. వీటితో పాటు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజరువిజయలక్ష్మి మాట్లాడుతూ ఏప్రిల్ నెల మూడవ తేదీ వరకు ఈపోసకాహారం పక్వాడ కార్యక్రమాలుఉంటాయనిచెప్పారు. ఈసందర్భంగాపోషకాహారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగునమ్మ, సర్పంచిరాణి, సూపర్‌వైజర్‌శిరీష, గోవిందరెడ్డి, రవీంద్రరెడ్డి, అంగన వ్డాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

పెద్దపంజాణి మార్చి 27 ప్రభాతవార్త :

పెద్దపంజాణి మండలంలోని మహాత్మజ్యోతీరావుపూలే గురుకులపాఠశాల 2023-2024వ సంవత్సరం 5వ తరగతి ప్రవేశానికి దరకాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.జ్యోత్స్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆసక్తిగలవారు ఏప్రిల్4వ తేదీ లోపు ఆన్‌లైన్లోదరకాస్తు చేసుకోవాలని సూచించారు. దరకాస్తుచేసుకునే బీసీ,ఈబీసీ విద్యార్థులకు 11సంవత్సరాలు,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు 13సంవత్సరాల వయసుకలగి ఉండాలన్నారు. వివరాలకు గురుకులపాఠశాల ఫోన్ నెంబర్ :9515764818కు ఉదయం 9-5గంటల మధ్యలో ఫోన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చుని పేర్కొన్నారు.

## కుప్పంలో హౌసింగ్ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినతి

కుప్పం, మార్చి 27 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు స్థలాలు, వివిధ భూమస్యలపై సోమవారం జాయింట్ కలెక్టర్ డా॥ వెంకటేశ్వర్‌ను చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, రెస్కో ఛైర్మన్ జిఎస్ సెంధిల్‌కుమార్, కు ప్పం పరిశీలకుడు రెడ్డెప్ప కలసి విన తిపత్రంఅందించారు. నియోజకవర్గం లో పలుచోట్ల లేఔట్లకు స్థలాల సమ స్య ఉండడంతో పాటు వివిధ భూ సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ సమస్యల పరిష్కారంకు వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎసిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, వడ్డెర కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎన్టీఆర్ ట్రస్ట్‌చే కుప్పంలో మెగా వైద్య శిబిర



– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పంరూరల్, మార్చి 27 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈనెల 29వతేది బుధవారం కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ అధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం తెలిపారు. కుప్పంలోని తెదేపా కార్యాలయంలో బుధవారం ఉదయం 10గంటలనుంచి రక్తదాన శిబిరం కొనసాగుతు oదన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు స్వచ్ఛం దంగా వచ్చి ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానంతోఎలాంటి ప్రాణహాని ఉండని

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలని విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు

ఓజిలి, మార్చి 27, ప్రభాతవార్త



ఓజిలి మండలం పున్నెపల్లి గ్రామానికి చెందిన మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు మైలారి వజ్రమ్మను రాజకీయ కారణాలతో గతంలో నిలిపివేశారని తక్షణం ఆమెను విధుల్లో తీసుకోవాలంటూ ఓజిలి మండలం ఎంఈఓ శైలజకి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓజిలి మండలంలో అధికార పార్టీకి చెందినటువంటి నేతలు అధికార యంత్రాంగాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని కార్మికులను ఇబ్బందులు పెట్టడం తగదని హితవు పలికారు. రాజకీయాలు కారణాలతో పున్నెపల్లి గ్రామానికి మధ్యాహ్న భోజన పథక కార్మికురాలు మైలారి వజ్రమ్మను మానసికంగా వేధించడం అధికార పార్టీకి తగదని ఆయన తెలిపారు. తక్షణం ఆమెను విధుల్లో తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మండలంలో అధికార పార్టీ నాయకులు కార్మికులపై నిత్యం వేధింపులు జరుగుతున్నాయని భవిష్యత్తులో కార్మిక వర్గం తరపున పెద్ద పోరాటం తప్పదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బి. గోపాల్, కార్మికులు విమలమ్మ, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## అలంకరణ చేపల పెంపకంపై అవగాహన

వాకాడు, మార్చి 27, ప్రభాతవార్త



అలంకరణ చేపలు ఉత్పత్తి ద్వారా జీవనోపాధి మెరుగు పరచు కోవాలని మత్స్యకార మహిళలకు వాకాడు సొసైటీ అధ్యక్షులు, వైకాపా సీనియర్ నేత కొడవలూరు దామోదర్ రెడ్డి పేర్కొన్నా రు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో స్త్రీ శక్తి భవనంలో అలంకరణ చేపల పెంపకం పై మత్స్యకార మహిళలకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి మెరుగుపరుచుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అలంకరణ చేపలు ద్వారా మత్స్యకార మహిళలకు మత్స్యకార, ఫారెస్ట్ అధికారులు సలహాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఫారెస్ట్ సబ్ డిఎఫ్ఓ జ్ఞాన ప్రకాష్, మత్స్యకార శాఖ ఏడి చాంద్ భాషా, ఎంపిడిఓ గోపినాధ్, మచ్చు శాఖ కాలేజీ ప్రొఫెసర్ ఆనంద్, ఎప్డిఒ రెడ్డి నాయక్, జడ్పిటిసి రౌతు రామకృష్ణ, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గాయం శ్రీనివాసులు, మత్స్యశాఖ ఇన్స్‌పెక్టర్ రఘుబాబు, బిఎఫ్ఎలు నాగరాజు, శ్రీను, రమేష్ సాయి, జగపతి బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీలేకుండా పన్నులు చెల్లించి లబ్ధిపొందండి

-కమీషనర్ నర్సింహప్రసాద్

పుంగనూరు, మార్చి 27 ప్రభాతవార్త :

మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న కుటుంబాలు తమ ఆస్తిపన్నులను ఈనెలాఖరులోగా చెలి ంచాలని కమీషనర్ నర్సింహప్రసాద్ కోరారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోగా చెల్లించినవారికి వడ్డీ నుంచి రాయితీ ఉంటుందన్నారు. పూర్తిగా ఏకమొత్తంలో చెల్లించినవారికి మాత్రమే వడ్డీరాయితీ ఉంటుందన్నారు. పన్నులు చెల్లించనివారిపై ఏప్రిల్ 1 నుంచి చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన జగన్‌ను ఆశీర్వదించండి

నాయుడుపేట, మార్చి 27 ప్రభాతవార్త



గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదిం చాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండ లి సభ్యులు కిలివేటి సంజీవయ్య కోరారు. సోమవారం నాయుడుపేట మండలం కూచివాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం లో అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలపై ముద్రించిన బుక్‌లెట్లను ప్రజలకు అందజేసి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకోవడంతో పాటు ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని, పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చాక జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని చెప్పారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇంకా అదనంగా ఎన్నో పథకాలు అమలు చేశారని తెలియజేశారు. అనంతరం ఆయన కూచివాడ గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ ఒట్టూరు కిషోర్‌యాదవ్, ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, మండల వైసీపీ కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, వైసీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కట్టా రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఆక్రమదారుల జాబితాను విడుదల చేసిన అధికారులు

కోట, మార్చి 27, ప్రభాతవార్త



కోట పట్టణంలో కోట అడ్డ రోడ్డు నుంచి కోట కొత్త చెరువు వరకు ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్ల ఆక్రమణ తొలగింపుకు రంగం సిద్ధమైంది. దశాబ్దాల కాలంగా సర్వేయర్లతో రాజకీయ ఒత్తిడితో ఆగిన రోడ్ల విస్తరణ కార్యక్రమాన్ని ఆర్డిఓ కిరణ్ కుమార్ చొరవతో విజయవంతమైంది. మండల ఎన్నికలకు ముందు సర్వే పూర్తి చేసినా గూడూరు డివిజన్ సర్వేయర్ బృందం నేడు మరలా కసరత్తులు ప్రారంభించింది. అందులో భాగంగా 333 మంది ఆక్రమదారులకు నోటీసులు సిద్ధం చేసి వాటిని ఆక్రమదారులకు అందజేసారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డివిజనల్ సర్వేయర్ రఘురామరాజు విలేకరులతో మాట్లాడుతూ ఆర్డిఓ ఆదేశాల మేరకు ఆక్రమణదారులకు నోటీసులు అందజేసామన్నారు. నోటీసు అందుకున్న వారు వారం రోజులు లోపల తమ అభ్యంతరాలను రెవెన్యూ, ఆర్‌అండ్‌బి కార్యాలయంలో గానీ తెలియజేయాలన్నారు. ఫిర్యాదు అనంతరం ఆర్డిఓ కిరణ్ కుమార్ అఖిలపక్ష భేటి ఏర్పాటు చేసిన అనంతరం రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌పద్మావతి, ఎంపిడిఓ భవాని, మండల సర్వేయర్ గోపి, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్పెంటర్స్‌డే

సదుం, మార్చి 27 ప్రభాతవార్త :

మండల పరిదిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల కార్పెంటర్స్ ఆధ్వర్యంలో సోమవారం కార్పెంటర్ స్డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విరిగిపోయిన పాడైపోయిన కుర్చీలు, బల్లలు, కిటికీలు వంటి వాటిని ఉచితంగా మరమ్మతులు చేశారు. కార్పెంటర స్డే రోజున ఈవిధంగా సేవ చేయడం తాము అలవరచుకున్నామని వారు తెలిపారు. మరమ్మతులు చేసినందుకు ప్రధానోపాధ్యాయులు ఫజురుల్లా వారికి కృతజతలు తెలిపారు. కార్యక్రమంలో సదుం కార్పెంటర్స్ అసోసియేసన్ కన్వీనర్ మహబూబ్‌భాషా, ఉపాధ్యక్షుడు అల్లాఫ్, కార్యదర్శి కేశవాచారి, ఉపకార్యదర్శి హరి సభ్యులు అన్సర్‌భాషా, జపాబీర్, మురళీకృష్ణమాచారి, బాలకృష్ణ, బీష్మాచారి, సుబ్రమన్యం, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ విరుద్ధంగా దళితక్రిష్టియన్లకు రిజర్వేషన్

–ఆందోళనకు సిద్ధమౌతున్న దళితులు

పుంగనూరు, మార్చి 27 ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా కొత్తగా దళిత క్రిష్టియనపేరుతో బిసిగా ఉన్నక్రిష్టియన్లను ఎస్సీ లలో చేర్చడం దారుణమని దీనిని వ్యతిరేఖిస్తున్నామని బిజెపి ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, పుంగనూరు ఎం. గణేష్ ,పురుషోత్తం, నరేంద్రకుమార్‌తో కలసి వారు ఆర్డీవో మురళికు ఈమేరకు వినతిపత్రమందించారు. ఆయన మాట్లాడుతూ ఇంతవరకు కులాలను ఎసీ లలో చేర్చి తమకు అంబేద్కర్ అందించిన రిజర్వేషన్‌ను ముక్కలు చేశారని, ఇపుడు కొత్తగా ఒక మతాన్ని ఎస్సీలలో చేర్చడం దారుణాని దారుణమన్నారు. ఇప్పటికే బిసిలుగా ఉండి ఎంతో ఉన్నతి సాధించిన క్రిష్టియన్లు ఇపుడు ఎస్సీలలో చేరడం ద్వారా తమకు ఉన్న రిజర్వేషన్ పూర్తిగా వారు దోచుకుపోయే పరిస్థితి ఉందన్నారు. దీనిని అనుమతించబోమని, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమౌతామన్నారు.

## శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆదాయం రూ.82.549

పుంగనూరు, మార్చి 27 ప్రభాతవార్త :

పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వరస్వామివారి ఆలయ ఆదాయం రూ.82,549 లభించిందని కార్యనిర్వహణాధికారి కమలాకర్ తెలిపారు. సోమవారం ఉదయం ఆలయంలో హుండీలెక్కింపు ఆయన అధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారి ఆలయం దేవాదాయశాఖలోనికి తీసుకున్న తరువాత తొలిసారి గా నాలుగునెలల ఆదాయం రూ.82వేల వరకు రావడం జరిగిందన్నారు.

## రేపు కుప్పం మండల మీట్

కుప్పంరూరల్, మార్చి 27 ప్రభాతవార్త

కుప్పం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29న బుధవారం ఉదయం 10.30గంటలకు కుప్పం మండల కార్యాలయంలో జరుగుతుందని ఎంపిపి అశ్విని మురుగేష్, ఎంపిడిఒ జానకమ్మ తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

# సేవకు ప్రతిఫలం అందింది

## - జాతీయ అవార్డు అందుకున్న ఏకొల్లు సర్పంచ్

దొరవారిసత్రం, మార్చి 27 ప్రభాతవార్త

ఆమె ఒక మహిళా సర్పంచ్. అందరిలాగా కాదు. సేవే లక్ష్యంగా పని చేస్తూ తనదైన శైలిలో అభివృద్ధి చేసి అందరిచేత శభాష్ అనిపించుకుంది. దొరవారిసత్రం మండలం ఏకొల్లు సర్పంచ్‌గా ఆవుల బ్లెస్సీ గెలుపొందినప్పటి నుంచి తనదైన శైలిలో పంచాయతీ అభివృద్ధికి భర్త ఆవుల అనిల్‌కుమార్, తన కుటుంబ సభ్యుల సహకారంతో ముందడుగు వేసింది. ఓ వైపు పంచాయతీకి నిధుల కొరత ఉన్నప్పటికీ సేవలు అందించడంలో ఎక్కడా కూడా వెనకాడలేదు. సేవే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈమె సేవకు ప్రతిఫలం లభించింది. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఈమె సేవలను గుర్తించి ప్రభుత్వం జాతీయ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును రెండురోజుల క్రితం ఢిల్లీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి నరసింహ చేతుల మీదుగా అందుకున్నారు. 1100 నామినేషన్లలో ప్రథమ స్థానంలో ఏకొల్లు సర్పంచ్‌ను ఎంపిక చేయడం గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. ఏకొల్లుసర్పంచ్ఆవులబ్లెస్సీ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ తనను నమ్మి ఓటేసిన ప్రజల రుణం తీర్చుకుంటున్నానని తెలిపారు. ఎల్లవేళలా నాకు అండగా భర్త అనిల్‌కుమార్, కుటుంబ సభ్యులు, బంధువులు తోడు ఉండి ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని, వారికి రుణ పడి ఉంటానని తెలిపారు.

**కరోనా సమయంలో ఈమె సేవలు భేష్** కరోనా సమయంలో గ్రామ పంచాయతీని తన కుటుంబ సభ్యుల సహకారంతో నిరంతరం వీధులను శానిటైజ్ చేయించి, కరోనా బారిన పడిన వారికి అధికారులతో మాట్లాడి వారికి తగు ఏర్పాట్లు చేయించి, చేసిన సేవే అవార్డు వచ్చి ఉంటుందని పలువురు భావిస్తున్నారు. కరోనాతో చనిపోయిన వారిని ప్రత్యేకంగా దహనక్రియలు చేయించడంలో మంచి పేరు తెచ్చుకున్నట్లు ప్రజలు గుర్తు చేస్తున్నారు.

# మహిళా సాధికారత కోసమే సంక్షేమ జగనన్న పథకాలు - మంత్రి రోజా

పుత్తూరురూరల్, మార్చి 27 ప్రభాతవార్త:
రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి రోజా తెలిపారు. పుత్తూరు మున్సిపాలిటీ పుత్తూరు గ్రామీణ మండలానికి సంబంధించిన పొదుపు సంఘాల మహిళలకు స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో వైఎస్ఆర్ ఆసరా 3వ విడత పంపిణీ సందర్భంగా సోమవారం జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ఆసరా కింద గత మూడేళ్ళలో 19.172 కోట్ల రూపాయలు పంపిణీ చేయగా, 3వ విడతలో 6.412 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మహిళా ముఖ్యమంత్రులు కూడా మహిళల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదని వివరించారు. రాష్ట్ర



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని గెలిపిస్తేనే ఇన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధిసాధ్యమవుతుందనితెలిపారు. చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసం చేశారని, అందు వలన 2019 ఎన్నికల సమయంలో మహిళలు సమయం చూసి తోక కోసి సున్నం పెట్టి బుద్ధి చెప్పారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి పేదవారు పక్క రాష్ట్రం లో కూడా కార్పొరేట్ వైద్యం చేసుకునేలా జగనన్న ఏర్పాటు చేశారని తెలిపారు. పుత్తూరు మున్సిపాలిటీ, పుత్తూరు మండలంలోని మహిళలకు 3వ విడత ఆసరా కింద 11.27 కోట్ల చెక్కులను మంత్రి పంపి ణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి మంత్రి పాలాభిషేకం చేశారు. సమావేశంలో డీఆర్‌డీ ఏపీడీ జ్యోతి, మున్సిపల్ చైర్మన్‌హరి, వైస్ చైర్మన్‌లు జయప్రకాష్, శంకర్, ఎంపీ పీ మునివేలు, వైస్ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పం చ్‌లు, రాష్ట్ర డైరెక్టర్లు, వివిధకమిటీలచైర్మన్‌లు, సభ్యులు, మున్సి పల్ కమిషనర్, ఎంపీడీవో ఇందిరమ్మ, తహసీల్దార్, ఏపీఎంసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు గోవిందస్వామిరెడ్డి, అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధారాలుంటే బయట పెట్టండి

శ్రీకాళహస్తి, మార్చి 27ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న దేవాలయాలను శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి జీర్ణోద్ధారణలు గావిస్తుంటే చూసి ఓర్వలేక తెలుగుదేశం నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మతి లేని ప్రకటనలు చేస్తున్నారని ధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్ జయశ్యాం, మున్నారాయల్‌లు ధ్వజమెత్తారు. ఆయన స్వగ్రామంలోని ఆలయాలను బాగు చేసుకోలేని దుస్థితిలో ఉంటే ప్రస్తుతం మా ధర్మకర్తల మండలి ఎంఎల్ఏ సూచనలతో ఊరందూరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని రూ.40లక్షలతో ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. ఆరోపణలు చేసే ముందు నిజానిజాలు తెలుసుకోవాలని మున్నారాయల్ సూచించారు. ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలోని మూల విరాట్టును తొలగించిన రోజు శాసనసభ్యులు అసెంబ్లీ సమావేశాల్లో ఉండగా ఆయన ఇక్కడి బంగారునాణెములు తస్కరించి హైదరాబాదులో అమ్ముకోవటానికి ప్రణాళిక రూపొందించినట్లు చేసిన ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. 30సంవత్సరాలుగా దేవస్థానం సొత్తును అప్పనంగా దోచుకున్న మీ కుటుంబం నిప్పులాంటి ఎంఎల్ఏ మధుసూధనరెడ్డిని విమర్శించటం హాస్యాస్పదమన్నారు.

## రామమందిర కుంభాభిషేకం

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 27ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం గుంటకింద పల్లి గ్రామంలో గ్రామస్తుల భాగస్వామ్యంతో కొత్త రామమందిరం నిర్మించారు. ఈ ఆలయ కుంభాభిషేక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇక్కడ చాలా కాలంగా సీతారాముల పురాతన కాలం నాటి ఫోటోలతో పూజలు నిర్వహించే వారు. శ్రీరామనవమి సందర్భంగా 15రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించే వారు. ఈ నేపధ్యంలో ఇక్కడ కొత్తగా మందిరం నిర్మించి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కుంభాభిషేకానికి సోమవారం ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వచ్చారు. ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఆలయ నిర్వాహాకులు ముఖ్యఅతిధికి ఘనస్వాగతం పలికారు. సీతారాములను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ పెంచులమ్మ, ఎంపిటిసి రఘురామిరెడ్డి ఎస్‌సివి దిలీప్‌కుమార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రంగస్థలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త



రోజు రోజుకు కనుమరుగౌతున్న నిరాదరణ, నిర్లక్ష్యానికి గురౌతున్న రంగస్థలాన్ని రంగస్థల కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరు కళాకారులపై ఉందని పలువురుకళాకారులు అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్బంగా పట్టణంలోని సదాశివటవర్స్ నందు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని కళాకారుల సమావేశం జరిగింది. ఒక నాడు రంగస్థలం ప్రధాన ప్రచార మాద్యంగా ఉండేదన్నారు. అయితే అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో రంగస్థలం క ళాకారులు కనుమరుగౌతున్నారన్నారు. ఈ పరిస్థితిలో రంగస్థలాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉందన్నారు. అయితే ఎందుకో ప్రభుత్వాలు రంగస్థలంపై కానీ ఆ కళాకారులపై కరుణ చూపటం లేదన్నారు. ఎందరో రంగస్థల కళాకారులు నేడు తమ వృత్తిని వీడి కూలీలుగా పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ పరిస్థితిలో రంగస్థల కళాకారులను ప్రభుత్వం, పాలకులు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సాంబరషీద్, పసల కృష్ణయ్య, అల్లం మణి, పూడి శ్రీనివాసులు, మాధవ, తులసి, వాణి, పొట్టిమామ, ప్రజ్వల, కృషారావు, ఆషా, గాంధీ తదితరులు హాజరయ్యారు.

## బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు నామినేషన్ ప్రక్రియ సోమవారం బార్ అసోసియేషన్ ఆవరణలో ఎన్నికల ప్రధాన అధికారి కె.ఉదయనాధ్, సి.సుబ్రమణ్యం జి.రాజేశ్వరరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడుతో పాటు ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా మాడుపూరు ప్రసాద్‌నాయుడు, ఉపాధ్యక్షుడుగా వి.మల్లికార్జునయ్య, కార్యదర్శి కె.కమల్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎం.చంద్ర, ట్రెజరర్‌గా డి.శశికుమార్, కమిటీ సభ్యులుగా కంటా ఉదయ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

## వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త



మండలంలోని చిన్నసింగమాల గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి చందనాలంకరంతో ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. స్వామివారి పూజల్లో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లోపలువురు గ్రామస్తులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## తిరుపతి తిరుమలలో గంజాయి మాఫియాను అరికట్టండి

జనసేన నాయకులు వినతి

తిరుపతి క్రైం, మార్చి 27, ప్రభాతవార్త



తిరుపతి నగరంలోనే కాకుండా తిరుమల కొండపై కూడా గంజాయి మాఫియా ఆగడాలు రోజురోజుకి పెరిగిపోతున్న తరుణంలో ఈ గంజాయి విక్రయాలకు పాల్పడి యువత భవిష్యత్తులను నాశనం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి అడిషనల్ ఎస్పి వెంకట్రావుకి జనసేన పార్టీ తరపున సోమవారం వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి సానుకూలంగా స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకుంటామని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజా రెడ్డి, ఉపాధ్యక్షుడు బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్, మునుస్వామి, రాజేష్ ఆచారి, కిరణ్ కుమార్, సుజితలకు హామీ ఇచ్చారు.

## ప్రతి ఇల్లు ఓరంగస్థలమే

-కళాకారులకు రాయలసీమ రంగస్థలి సత్కారం

తిరుపతి, మార్చి 27ప్రభాతవార్త:



సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా కళాకారులను ప్రోత్సహిస్తూ ,ప్రతి ఇల్లు ఓ రంగస్థలంగా చూస్తున్న కళాకారులందరికీ రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనా థరెడ్డి ఘనంగా సత్కరించారు. ప్రతి మనిషి జీవితంలో ఏదురంగాలు కలయిక జీవన్నాటకమన్నారు. దేశవిదేశాల్లోనూ మన తెలుగుజాతి సంస్కృతి సంప్రదాయలు ఉట్టిపడేలా గుర్తుచేస్తున్న కళాకారుల త్యాగం విలువకట్టలేనిదన్నారు. సీనియర్ కళాకారులు కొత్తపల్లి మునిరత్నం, ఆముదాల నారాయణ, సాయినవీన, కొత్తపల్లి లతలను రాయలసీమ రంగస్థలి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపింది .ఈ కార్యక్రమంలో కళాకారులు కెఎన్ రాజా, రామచంద్రారెడ్డి, జికె సుందరం, పొన్నాలజేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, శాంబోలుహరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వంక కాల్వ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విజయపురం, మార్చి 27 ప్రభాతవార్త :



మండలంలోని పాతార్కాడులో వంక కాల్వ ఆక్రమణపై గ్రామస్తులు చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో పశువులు వెళ్లడానికి, జంతువులు తాగడానికి సౌకర్యంగా వున్న వంకను క్రమంగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించారని తెలిపారు. గతంలో కూడా సర్వే నెంబరు 116/2లో 1.3 ఎకరాల భూమిని ఆక్రమించారని, ప్రస్తుతం వంకను కుదించుకుంటూ భూఆక్రమణ చేస్తున్నారని వీటిపై అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరడంతో సర్వేయరు శేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తామన్నారు.

## యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా మణిగండన్

విజయపురం, మార్చి 27 ప్రభాతవార్త :





యుటిఎఫ్‌జిల్లాకార్యదర్శిగామణిగండన్ ఎన్నికయ్యారు. చిత్తూరులో 47వ జిల్లా కౌన్సిల్ ఎన్నిక సందర్భంగా ఎన్నికైనట్టు తెలిపారు. జిల్లాఆడిట్‌కమిటీసభ్యుడిగావంశీకృష్ణనుఎన్నుకున్నారు. యూనియన్ పటిష్టతకు చేసిన కృషికి గుర్తింపు లభించిం దన్నారు. వీరిఎంపిక పట్ల మండల యుటిఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

విజయపురం, మార్చి 27 ప్రభాతవార్త :



మండలంలోని జంబాడ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులందరికీ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, వైస్ ఎంపిపి దశరథ సోమవారం పరీక్ష రాసే ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉపయుక్తంగా వుంటుందని పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాడు బాలసుబ్రమణ్యం కూడా పాల్గొన్నారు.

## ఇళ్ళ స్థలాలు చూపించాలి - సీపీఐ

రేణిగుంట, మార్చి 27 ప్రభాతవార్త:



రేణిగుంట మండలంలో ఉన్న పేద ప్రజలకు, ఇళ్ళ స్థలాలు చూపించాలని సీపీఐ జిల్లా నాయకులు తులసి రాజన్ ఆధ్వర్యంలో రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. తులసిరాజన్ ఇళ్ళ స్థలం ఇచ్చారన్నారు. దాదాపు మూడు సంవత్సరాలుగా రేణిగుంట పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గానికి చెందిన 3 వేల మందికి పట్టాలు ఇచ్చి స్థలం చూపించకపోవడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా పట్టాలు ఇచ్చిన వారికి స్థలం చూపించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జె.వి.చలపతి, నాయకులు శంషాద్, మస్తాన్, రహంతుల్లా, సుబ్బలక్ష్మి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కన్నప్పకు మండలాభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 27ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న భక్తకన్నప్ప కొండపై వెలసిన భక్తకన్నప్ప ఆలయ మండలాభిషేక పూజలు భక్తిశ్రద్దలతో నిర్వహించారు. సోమవారం ఈ అభిషేక కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన మండలాభిషేక కార్యక్రమాల్లో శాస్త్రోక్తంగా నిరంజన్ స్వామి పూజలు నిర్వహించారు. నిలువెత్తు విగ్రహానికి షోడషాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణానికి చెందిన పలువురు పెద్దలు హాజరయ్యారు. మొదట కలశ స్థాపన జరిపి స్థానిక సంప్రదాయం మేరకు మండల అభిషేక పూజలను నిర్వహించారు.

## పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయండి

తొట్టంబేడు, మార్చి 27 ప్రభాతవార్త



పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని తిరుపతి డిఎల్‌పిఓ రూపారాణి సోమ వారం ఎంపిడిఓ తరుణాక్షరెడ్డి, పంచాయతీ కార్యద ర్శులను ఆదేశించారు. సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో పన్నుల వసూళ్ళపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీ కార్యదర్శి వారివారి పరిధిలోని పంచాయతీల్లోని పన్నుల వసూలు చేసి పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలన్నారు. మొండి బకాయి ల వసూళ్ళు ఉన్న వారికి నోటీసులు ఇచ్చి వసూలు చేయాలని రానిపక్షంలో కోర్టు ద్వారా రాబట్టా లన్నారు. తిరుపతి జిల్లాలో ఇప్పటి వరకు 95శాతం పన్నులు వసూలు చేసినట్లు ఆమె తెలిపారు. బకా యిలు చెల్లించని వాటిలో ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాలే ఉన్నాయని సీనియర్ పంచాయతీ కార్యదర్శి హంసా ప్రకాష్ డిఎల్‌పిఓకు తెలిపారు. ఈనెల 31లోపు పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె తొట్టంబేడు-2 సచివాలయంలో రికార్డులను పరిశీలించి పన్నులు ఎంత మేరకు వసూలు చేశారో తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపిడిఓతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## టుటౌన్ సిఐగా మల్లికార్జున్

తొట్టంబేడు, మార్చి 27 ప్రభాతవార్త



పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ సిఐగా టి.మల్లికార్జున సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన నారాయణవనం, మదనపల్లి, వాయల్పాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి పదోన్నతిపై నంద్యాల, డోన్‌లో రెండేళ్ళపాటు సిఐగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాళహస్తి పట్టణ రెండో పోలీస్‌స్టేషన్‌సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా డిఎస్‌పి ధర్మవరపు విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు టుటౌన్ ఎస్ఐ మహేష్, సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ సిఐగా పనిచేసిన భాస్కర్‌నాయక్‌ను విఆర్‌కు పంపారు.

## వృద్దులకోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు

శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త




తల్లిదండ్రులు మరియు వృద్దులకోసం ప్రత్యేక చట్టాలు ఉన్నట్లు శ్రీకాళహస్తి ఆర్డీవో కెఎస్.రామారావు తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జాతీయ వృద్దుల హెల్ప్‌లైన్ గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్, సాంఘిక సంక్షేమ వసతి గృహాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నేడు తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను చూసుకోలేక వారి బిడ్డలు వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్నారని వీరి సంరక్షణ కోసం 2007లో ప్రభుత్వం ప్రత్యేక చట్టం తెచ్చిందన్నారు. వీరికి సూచనలు, న్యాయపరమైన సలహాలు ఇచ్చేందుకు 14567 నంబర్‌కు పోన్ చేయాలని తెలిపారు. నీకోసం మేము అడుగులు వేస్తున్నామన్న నినాదంతో వృద్దులను హింసించి ఇంటి నుంచి బయటకి పంపివేయబడిన వారిని సంరక్షిస్తామని తెలిపారు. పెన్షన్ మరియు చట్టపరమైన సమస్యలపై సలహాలు మరియు సూచనలు అందించేందుకు పైనంబర్‌కు పోన్‌చేయాలన్నారు. గోడపత్రికల ఆవిష్కరణలో ఆర్డీవో కార్యాలయ ఆర్ఐ అనిల్, మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్, సాంఘిక సంక్షేమ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నేడు కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ అదాలత్

- కలెక్టర్ వెంకట రమణారెడ్డి

తిరుపతిరూరల్, మార్చి27 ప్రభాతవార్త:
ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 11గంటలకు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ విజయవాడ నిర్వహిస్తారని, ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో ప్రభుత్వ పించన్లు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటి, ఫ్యామిలీ వెల్ఫేర్ రిటర్న్స్, మిస్సింగ్ క్రెడిట్స్ వంటివి పరిష్కరింపబడతాయని, ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సబ్సిడిధరలకే ట్రాక్టర్,పనిముట్లు పంపిణి

నింద్ర, మార్చి 27 ప్రభాతవార్త :



సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌బికె కార్యాలయంలో సబ్సిడి ధరలకే రెండు ట్రాక్టర్, నాలుగు రోటవేటర్‌లు, మడకలు, మల్టీ క్రాఫ్ క్రషర్‌లు రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా చేతుల మీదగా రైతులకు పంపిణి చేసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతుమిత్రా గ్రూపు ద్వారా అగరం, కచ్చరవేడు, కావనూరు గ్రామాలలోని రైతులకు ట్రాక్టర్, పనిముట్లు 40శాతం సబ్సిడితో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. రైతులుకు అందుబాటులో ఆర్‌బికే కార్యాలయాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఎరువులు, విత్తనాలు, రైతుపనిముట్లు అందజేస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో ఎట మురళీక్రిష్ణా, ఆర్‌బికె చేర్మన్ వీరయ్యానాయుడు, సిబ్బంది సుధాకర్, మిథున్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## రేపు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్

నూతన భవనం ప్రారంభం

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 27 ప్రభాతవార్త:



రేపు 29వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక బాలాజికాలనీలోని హౌసింగ్ బోర్డు ఆఫీస్ పక్కన నూతనంగా నిర్మించిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవన ప్రారంభ కార్యక్రమం, అలాగే అసోసియేషన్ తిరుపతి శాఖ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.మార్కొండారెడ్డి, ఎ.రాజశేఖర్‌లు తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగర మేయర్ డా॥శిరీష, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, 23వ వార్డు కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, 29వ వార్డు ఇన్‌ఛార్జ్ ఎం.మోహన్‌లు హాజరవుతున్నారని అన్నారు. కావున పాలకవర్గ సభ్యులు, అలాగే అసోసియేషన్ సాధారణ సభ్యులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆర్‌డి.సుబ్రహ్మణ్యం, విశ్వనాథనాయుడు, రామలింగారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల రక్షణకే మానిటరింగ్ కమిటీ

నగరి, మార్చి 27 ప్రభాతవార్త:



ఎస్సీ, ఎస్టీల రక్షణకే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఉందని జిల్లా స్థాయి కమిటీ సభ్యులు పి.బాబు అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సృజన అధ్యక్షతన నిర్వహించారు. డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఇతర సమస్యల గురించి చర్చించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న చట్టాలను గురించి వివరించారు. మానిటరింగ్ కమిటీ ఎప్పుడు వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఏ.దేవరాజులు, వి.రాజ్‌కుమార్, ఎం.డేవిడ్, డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కు 8 మంది విద్యార్థులు

నగరి, మార్చి 27 ప్రభాతవార్త:



నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో నగరి మండలం నుంచి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో నెత్తం కండ్రిగ ఎంపీపీఎస్‌కు చెందిన జనని, కేవీపీఆర్ పేట ఎంపీపీఎస్‌కు చెందిన సతీష్‌కుమార్, పుదుపేట ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, కీర్తన, ఐశ్వర్య, చింతలపట్టెడ ఉన్నత పాఠశాలకు చెందిన సతీష్, తమిళసెల్వి, సత్రవాడ ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య ఉన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కేంద్రంలో ఎంఈవో శ్రీదేవి అభినందించారు. వారికి ప్రశంసా పత్రంతో పాటు పుస్తకాలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఎన్ఎంఎంకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున 4 సంవత్సరాలకు స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన గైడ్ టీచర్లను అభినందించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ప్రసన్నకుమారి, నాధముని, కుప్పరాజు, ఉపాధ్యాయులు, మురుగప్పన్, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ కోసం చట్టబద్ధత కల్పించాలి

వడమాలపేట, మార్చి 27 ప్రభాతవార్త:



పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్పీ నాయకులు పులికుంట్ల గోపి మాదిగ డిమాండ్ చేశారు. మాదిగల సంగ్రామ యాత్రలో భాగంగా వడమాలపేట మండలం శ్రీ బొమ్మరాజపురం గ్రామ పంచాయతీ ఏఏ డబ్ల్యులో గ్రామసభ నిర్వహించారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానన్న బీజేపీ పార్టీ 9 సంవత్సరాలు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణ అంశం మీద మౌనం వహిస్తున్నదన్నారు. ఈ పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ కోసం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న ఎన్ఎస్పీ చిత్తూరు జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.నరేంద్రబాబు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తిరుపతి జిల్లాలో ఉన్నటువంటి అన్ని ఏఏడబ్ల్యు గ్రామాలు తరలి రావాలని పులికుంట్ల గోపి మాదిగ పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా ఎంఎస్పీ నాయకులుగోపిమాదిగ, వాసు మాదిగ, శివ మాదిగ, జానకిరాం, లక్ష్మయ్య, కుంచం మాతయ్య, వెంకటయ్య, చెంగయ్య, గెద్దం మాతయ్య కుంచం వినోద్, బాబి, ప్రదీప్, రాజేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి ప్రాణ దాతలు కండి

కేవీబీ పురం, మార్చి 27 ప్రభాతవార్త:
యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో 5వ వార్షికోత్సవ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని యువ సమాజ్ నిర్మాణ్ కమిటీ సభ్యులు, సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. ఆనందకుమార్, కె.వి.రావులు మాట్లాడుతూ మనకి ప్రాణం పోసిన ఆ భగవంతుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరొకరికి ప్రాణం పోసె అవకాశాన్ని మనకు ఇచ్చాడని తెలిపారు. అదే రక్తదానం ఈ అవకాశాన్ని మనలో ఎంత మంది ఉపయోగించుకుంటున్నామని, ఏ ధానం చేయాలన్న అది విద్య, విజ్ఞానం, డబ్బుతో కూడుకుని ఉంది ఒక రక్తదానం మాత్రమే మంచి మనసుతో ముడిపడి ఉందన్నారు. యువత ఎటువంటి తారతమ్యం లేకుండా ముందుకొచ్చి రక్తదాన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో నాలుగు సంవత్సరాలు నిర్విరామంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ 5వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా మెగా రక్తదాన శిబిరం 2వ తేదీ ఆదివారం ఏర్పేడు జరుగుతుందని, కావున రక్తదానం చేయడానికి ఉత్సాహం అందరూ ముందుకు రావాలని వారు కోరారు.

## గ్రామాల అభివృద్ధి-దేశ అభివృద్ధి

రేణిగుంట, మార్చి 27 ప్రభాతవార్త:



గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి అన్నారు. గ్రామ ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించడానికి ఆదివారం విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి తన స్వీయ వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా వైద్య పరికరాలను వితరణ చేశారు. గ్రామ వైఎస్ఆర్ క్లినిక్ సిబ్బంది, ఏఎన్ఎం ఆశ వర్కర్లు వైద్యానికి సంబంధించి టెస్టింగ్ కిట్లు, మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మిపతిరెడ్డి మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వైసీపీ మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం వైద్య పరికరాలను అందిస్తున్నామన్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించి తోడ్పడాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## సిమెంట్ షాపు భవనాన్ని కూల్చివేయండి

పుత్తూరు, మార్చి 27 ప్రభాతవార్త :
మునిసిపల్ కార్యాలయం సమీపంలో ఎటువంటి అనుమతి లేకుండా నిర్మించిన సిమెంట్, స్టీల్ షాపు భవనాన్ని కూల్చివేయాలని సమాచాక హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మునిసిపల్ కమిషనర్‌కు సోమవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. భవన నిర్మాణం జరిగిన స్థలంపై సంబంధిత యజమానికి భూమి హక్కులు లేవని తెలిపారు. ఆ నేపథ్యంలో ఆ భవనానికి సంబంధించి మునిసిపల్ అధికారులు ఎలా పన్ను వసూలు చేస్తారని ప్రశ్నించారు.

